# ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేదీ: 14.12.2025** **సమయం: 18.10 గంటలు**

## ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో రెండవ విడత గ్రామ పంచాయితీ ఎన్నికల ఫలితాల్లో సర్పంచ్ పదవుల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు స్పష్టమైన ఆధిక్యాన్ని కనుబరుస్తున్నారు.
2. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ళను అర్హులైన అందరికి అందిస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చెప్పారు.
3. ఖరీఫ్ సీజన్ లో ధాన్యం సేకరణ సజావుగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.
4. రాష్ట్రంలో రాగల 48 గంటల్లో పలు జిల్లాల్లో సాధారణం కన్నా 2 నుంచి 3 డిగ్రీల వరకు తక్కువ ఉష్ణోగ్రతలు నమోదై, చలి తీవ్రత పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

……………………………………………………

**కౌంటింగ్**

గ్రామపంచాయితీ రెండవ దశ ఎన్నికల్లో 80.84 శాతం ఓటింగ్ నమోదు అయినట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఓటింగ్ ముగిసే సమయానికి ఓటర్లు బారులు తీరి ఉండటంతో ఓటింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉంది. రెండవ విడత స్థానిక సంస్థల ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సమయానికి సర్పంచ్ పదవుల్లో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ఆధిక్యం కనబరుస్తోంది. కడపటి వార్తలు అందేవరకు కాంగ్రెస్ మద్దతుదారులు దాదాపు 900 కు పైగా స్థానాల్లో, బిఆర్ఎస్ మద్దతుదారులు దాదాపు 300 పైగా స్థానాల్లో, బిజెపి మద్దతుదారులు దాదాపు

90 కి పైగా స్థానాల్లో విజయం సాధించారు. ఇతరులు దాదాపు 250 కి పైగా స్థానాలను గెలుచుకున్నారు.

........డెస్క్

**ఇందిరమ్మ ఇళ్ళు**

రాష్ట్రంలో పేదల సొంతింటి కలను నేరవేర్చి, వారికి ఆత్మ గౌరవాన్ని అందించడానికి ఇందిరమ్మ ఇళ్ళను అర్హులైన వారందరికి అందిస్తామని  కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇండ్లు కేటాయించామని, రాబోయే జనవరిలో మరో 3,500 ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం కొండంపేట. మల్లంపేట, నక్కలపెల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు...ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలు పూర్తి అయిన తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరుగుతాయని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు.

**<u>బైట్</u> .................**

........పీటీసీ మంచిర్యాల జిల్లా...

**ఉత్తమ్ కుమార్ రెడ్డి**

ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో వరి ధాన్యం సేకరణ సజావుగా జరిగేలా, ఎలాంటి అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర  మంత్రి ప్రహ్లాద్ జోషికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల విభాగానికి సంబంధించిన కొన్ని కీలక అంశాలను ఈ లేఖలో ప్రస్తావించారు. 2025- 26 మార్కెటింగ్ సీజన్లో రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం తగ్గించే దిశగా కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని ఆయన కోరారు.

........డెస్క్

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు...**

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పంచాయతీ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా అధికారులు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే .రామకృష్ణారావు అన్నారు. నాగార్జునసాగర్ లో ఆంధ్రప్రదేశ్ గురుకుల జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలలో పాల్గొనేందుకు వెళ్తూ.. ఈ రోజు నల్గొండకు విచ్చేశారు. ఈ సందర్బంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్,గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా పరిశీలకురాలు కోర్రా లక్ష్మి , రాష్ట్ర మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ భవేష్ మిశ్రా ఆయనకు స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం ఆయన అధికారులతో జిల్లా అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

.....పీటీసీ నల్లగొండ జిల్లా

**సమ్మిట్**

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సందర్శన నిన్నటితో ముగిసింది. ఆఖరి రోజు దాదాపు 10 వేల మంది విద్యార్థులు, ప్రజలు ఈ సదస్సును సందర్శించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన ఏఐ రోబోలు, టచ్ కియోస్క్ లు, డిజిటల్ టన్నెల్, త్రీడీ తెరలు వారిని ఆకట్టుకున్నాయి.

**కవిత**

ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ఆర్టీసీని ప్రైవేటు పరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. నగరంలో గతంలో 7500 వరకు ఉండే ఆర్టీసీ బస్సులను.. ఉచిత బస్సు ప్రయాణం వచ్చాక 3500కు తగ్గించారని, దీంతో ప్రయాణికులకు చాలా ఇబ్బందులు ఎదురువుతన్నాయని ఆమె అన్నారు. రవాణా వ్యవస్థ సవ్యంగా లేనప్పుడు హైదరాబాద్ విశ్వనగరంగా ఎలా రూపుదిద్దుకుంటుందని ఆమె ప్రశ్నించారు.

అలాగే  కొండపోచమ్మ సాగర్ నుంచి హైదరాబాద్‌కు తాగునీరు అందించాలని,పట్టణ, నగర ప్రాంతాల్లో  కూడా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

.......డెస్క్

**ఆధార్**

అప్పుడే పుట్టిన శిశువు నుంచి 6 నెలల లోపు పిల్లలకు ఆధార్ నమోదును వేగవంతం చేయడానికి, ఆధార్ నమోదు బాధ్యతలను అంగన్ వాడీ కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఇప్పటి వరకూ నమోదు కాని వారిని గుర్తించి వెంటనే ఆధార్ నమోదు చేయించాలని ఐసిడిఎస్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.  6 నెలల లోపు చిన్నారుల్లో ఆధార్ నమోదు కాని వారిని తల్లులతో సహా గ్రామ సచివాలయాలకు తీసుకు రావాలని సూచించారు.

....డెస్క్

**MBBS సీట్లు**

దేశంలో MBBS సీట్ల విషయంలో రాష్ట్రాల మధ్య సమతౌల్యం లేదని పార్లమెంటరీ స్థాయి సంఘం తన నివేదికలో పేర్కొంది.  కొన్ని రాష్ట్రాల్లో ఎక్కువగా మరికొన్ని రాష్ట్రాల్లో జాతీయ సగటు కన్నా తక్కువగా మెడికల్ సీట్లు ఉన్నట్లు వెల్లడించింది. దేశంలో సగటున ప్రతి 10 లక్షల జనాభాకు 75 MBBS సీట్లు ఉన్నాయి. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో 150 వరకు పుదుచ్చేరి వరకు 2 వేల చొప్పున మెడికల్ సీట్లు ఉన్నట్లు నివేదిక స్పష్టం చేసింది.

.......డెస్క్

**ఇంధన పరిరక్షణ**

ప్రతి సంవత్సరం డిసెంబర్ 2వ ఆదివారాన్ని జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఇంధన పొదుపు మన బాధ్యత, దేశ అభివృద్ధి మన లక్ష్యం అనే నినాదంతో ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా అవగాహన సదస్సులు కొనసాగుతున్నాయి. ప్రతి యూనిట్ విద్యుత్ ను పొదుపు చేసి మన భవిష్యత్తుకు పునాది వేయాలని, ఇంధనాన్ని ఎట్టి

పరిస్థితుల్లో వృథా చేయవద్దని, భావితరాలకు ఇంధనాన్ని దక్కేలా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని ఈ సందర్భంగా కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ పిలుపునిచ్చింది.

.....డెస్క్

**బిఆర్ఎస్**

ఈ నెల 19న మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధ్యక్షతన బిఆర్ఎస్ ఎల్ పీ, బిఆర్ఎస్ కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నారు. తెలంగాణ నదీ జలాలను ఆంధ్రప్రదేశ్ వినియోగించుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నదని బిఆర్ఎస్ పార్టీ విమర్శించింది. నీటి పారుదల ప్రాజెక్టులలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని చర్చించటంతో పాటు, తదుపరి ప్రజా ఉద్యమాలకు సంబంధించిన ప్రణాళికలను ఈ సమావేశంలో రూపొందిస్తామని బిఆర్ఎస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

.......డెస్క్

**ఫుట్ బాల్**

మన రాష్ట్రానికి ఒలింపిక్స్ నిర్వహించగల శక్తి సామర్థ్యాలు ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మెస్సీ గోట్ టూర్ తో క్రీడా ప్రపంచంలో తెలంగాణా ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకుందని ఆయన అన్నారు. హైదరాబాద్ వేదికగా అరుదైన ఘనతలు సాధించామని, ఈ క్రీడా వేడుక మరిన్ని టోర్నమెంట్ లను రాష్ట్రంలో నిర్వహించటానికి తగిన స్ఫూర్తిని అందిస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

.........డెస్క్

**నల్లమల**

నల్లమల అటవీ ప్రాంతంలో దర్శనీయ స్థలాలు, పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. నల్లమల పర్యాటక హబ్ పేరిట అటవీ ప్రాంతాల్లో కాటేజీలు, సఫారీలను ఏర్పాటు చేయటానికి సంకల్పించింది. ఇందుకు సంబంధించి

వచ్చే సంవత్సరం జనవరిలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తారు.

.........డెస్క్

**వాతావరణం**

రాష్ట్రంలో రాగల 48 గంటల్లో పలు జిల్లాల్లో సాధారణం కన్నా 2 నుంచి 3 డిగ్రీల వరకు తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని వెల్లడించింది. అలాగే హైదరాబాద్ ప్రాంతాలతో పాటు శివారు ప్రాంతాల్లో చలి తీవ్రత ఉంది. అలాగే రాష్ట్రంలోని అటవీ ప్రాంతాలు అధికంగా ఉన్న జిల్లాల్లో చలి ప్రభావం, చలిగాలులు తీవ్రంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

......పిఎన్